

కలెక్టరేట్ వద్ద చలువ పందిళ్లు వేయించండి : సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద సమస్యలు చెప్పుకోవడానికి గుంపుగా వచ్చే ప్రజలకు, ఆందోళనలు చేపట్టే వారికి నిలవ నీడలేని పరిస్థితి ఉండని కలెక్టరేట్ వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేసి... ఎండ నుంచి రక్షణ కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కలెక్టర్ వెంకటేశ్వర్ కు విజ్ఞప్తి చేశారు. తిరుపతి కలెక్టరేట్ వద్ద భద్రత పేరుతో పోలీసులు చేస్తున్న హడావిడి వల్ల ఎర్రటి ఎండలో ప్రజలు నిలబడాల్సి వస్తోందన్నారు. తాగడానికి నీరు లేదని, కూర్చునే వసతి లేదన్నారు. ఎండ తీవ్రతకు ముందే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఉదయం 8 గంటల నుండే ప్రారంభించడం ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు. ప్రతి సోమవారం అన్నాక్యాంటీన్ ద్వారా తక్కువ ధరకు భోజనం, టీ,కాఫీలు, మజ్జిగ అందించాలన్నారు. ప్రతి అంతస్తులోనూ తాగునీటి సౌకర్యం ఉండాలని, ప్రవేశ ద్వారం వద్ద తాగునీటిని ఏర్పాటు చేయాలని కోరారు.



వెటర్నరీ విద్యార్థుల నిరవధిక సమ్మె విరమణ

ప్రజాశక్తి - క్యాంపస్

పశువైద్య విద్యార్థుల స్టైఫండ్‌ను ఇతర మెడికల్ కళాశాల విద్యార్థులతో సమానంగా పెంచాలని కోరుతూ గత 46 రోజులుగా కొనసాగుతున్న నిరవధిక సమ్మెను బుధవారం రోజు ప్రభుత్వం జీవో విడుదలతో గురువారం అధికారికంగా పశువైద్య విద్యార్థుల సమ్మె విరమించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డా. రవి, విసి డా. జె.వి. రమణ, ప్రిన్సిపల్ డా. జగదీశ రామయ్య, యూనివర్సిటీ డీన్ డా. వీరబ్రహ్మయ్య లకు విద్యార్థుల ప్రతినిధులు తమ నిర్ణయాన్ని వివరించారు. ఈ సమ్మె నేపథ్యంలో వెటర్నరీ విద్యార్థులు అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి తమ స్టైఫండ్‌ను ఇతర మెడికల్ కోర్సుల విద్యార్థుల స్థాయిలో పెంచాలని డిమాండ్ చేశారు. అయితే, విద్యార్థుల డిమాండ్‌కు పూర్తిస్థాయిలో స్పందించకపోయినా, ప్రస్తుతం అందుతున్న స్టయిఫండ్ పై 50శాతం పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. విద్యార్థులు ఆశించిన స్థాయిలో స్టైఫండ్ పెరుగుదల లేకపోయినా, మంత్రి అచ్చెం నాయుడు మూడు నెలల్లో మళ్లీ సమీక్షించి మరింత పెంపు చేస్తామని హామీ ఇవ్వడంతో, విద్యార్థులు బాధతోనే సమ్మెను విరమించారు. ఇది శాశ్వత పరిష్కారం కాదని, ప్రభుత్వం మళ్లీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, వెటర్నరీ విద్యార్థులు మరింత తీవ్ర స్థాయిలో సమ్మెను పున్నప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

చేనేత కార్మికులకు ఉపాధి చూపాలి

సిపిఎం ప్రజాచైతన్య యాత్రల్లో డిమాండ్

ప్రజాశక్తి - వెంకటగిరి

వెంకటగిరి చేనేత చీరలకు ఉన్న ప్రతిష్ట, ఈ ప్రాంత ప్రజలకు లేదని, చేనేత కార్మికులకు ఉపాధి చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి అన్నారు. గురువారం 1, 2, 3 వార్డుల్లో బంగారుపేట ఏరియాలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. నూలు ధర తగ్గించాలని, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. మూడు రోజులకు ఒకసారి తాగునీరు వస్తోందన్నారు. మురుగునీటితో తాగునీటిపైపులు ఉండటం వల్ల కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారన్నారు. స్మశాన స్థలం 11 ఎకరాలకు పైగా ఉండాలని, అయితే ఎక్కువ భాగం ఆక్రమణకు గురయ్యిందన్నారు. ఎంఎల్ఏ స్పందించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, ఐలా భాస్కర్, సుబ్బరాయులు, చంద్రశేఖర్, రత్నమ్మ, నారాయణ, రాజయ్య పాల్గొన్నారు.

- నత్తవేడు మండలం పేరడం గిరిజనులు మూడేళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నా ఇంటిపట్టాలు ఇవ్వలేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో మెలుగు రమేష్, నాగరాజు, కృష్ణయ్య, సుశీల, నరసింహులు, ఏరమ్మ, గోవిందమ్మ, లక్ష్మమ్మ, రాణమ్మ, నాగమ్మ, కొల్లాపూర్ శాంతి పాల్గొన్నారు.





రేషన్ షాపును ఏర్పాటు చేయాలని ధర్నా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి రూరల్ పరిధిలో ఉండే తనపల్లి ఇందిరమ్మ ఇళ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, రేషన్ షాపును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో వినూత్న నిరసన తెలిపారు. రూరల్ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్.జయచంద్ర, పి.సాయిలక్ష్మి, ఎం.నరేంద్ర, మునిరాజ్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఏటువంటి సౌకర్యాలు కల్పించకుండా గాలికి వదిలేశారన్నారు. రేషన్‌షాపులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. చిరంజీవి, యుగంధర్, మధు, గణేష్, శ్రీవాణి పాల్గొన్నారు.



రేణిగుంట విమానాశ్రయంలో సిఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుమలకు చంద్రబాబు కుటుంబం

ప్రజాశక్తి - తిరుమల

సిఎం చంద్రబాబునాయుడు కుటుంబం గురువారం రాత్రి తిరుమల చేరుకుంది. మనవడు దేవాన్ష్ పుట్టినరోజు శుక్రవారం కావడంతో అతని పేరుతో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో స్వయంగా అన్నదానం చేయనున్నారు. ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్యచౌదరి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. శుక్రవారం శ్రీవారిని దర్శించుకుంటారు. గురువారం రాత్రి శ్రీ పద్మావతి అతిథిగృహంలో బస చేశారు.

గురువారం టిటిడి ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. పద్మావతి అతిథిగృహం వద్ద వసతి, దర్శన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు లోకనాథం, రాజేంద్ర, భాస్కర్, వీజీవో సురేంద్రపాల్గొన్నారు. తిరుపతిలో మామిడికాయల మండి నుంచి అలిపిరి వరకూ పారిశుధ్య పనులను, బారికేడ్లను నగర కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. ఈ నేపథ్యంలోనే 21వ తేదీ నిర్వహించాల్సిన వేలాన్ని 22వ తేదీ ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నామని తెలిపారు

ఊరందూరు ఎస్సీ రైతులకు వనరాజా కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్

మండలంలోని ఊరందూరు పంచాయితీ గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఆఫ్ పౌల్ట్రీ బ్రీడింగ్ న్యూఢిల్లీ డి.వి.ఆర్ ఎస్వి. వైద్య కళాశాల తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో ఊరందూరు పంచాయతీ ఎస్సీ రైతులకు వనరాజా కోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పౌల్ట్రీ ప్రాజెక్ట్ తిరుపతి కో ఇన్వెస్టిగేటర్ రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ఎస్సీ రైతులు ఆర్థికంగా అభివద్ధి చెందాలనే ముఖ్య ఉద్దేశంతో రైతులకు ఈ వనరాజా కోళ్లను పంపిణీ చేశారన్నారు. అలాగే ఈ కోళ్ల పెంపకం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. గ్రామంలో ఉన్న 30 మంది రైతులకు ఒక్కొక్కరికి 10 కోళు చొప్పున పంపిణీ చేశారు. ఈ కోళ్లు గుడ్డు పెట్టే దశకు వచ్చినప్పటి నుంచి సుమారు 150 నుంచి 170 రోజుల వరకు గుడ్లు పెడతాయని, అలాగే వీటి బరువు సుమారు నాలుగు కేజీల వరకు వస్తుందని అన్నారు. రైతులకు కోళ్లతోపాటు 10 కేజీలు దానా, కోళ్లను రాత్రిపూట కప్పి పెట్టడానికి ట్రేడ్లు, మంచినీళ్లు బకెట్ అందజేయడం జరిగిందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఏ.డి శ్రీకాంత్ మాట్లాడుతూ వనరాజా కోళ్ల పెంపకం రైతులకు ఎంతో ఆదాయ వనరుగా ఉంటుందని అన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఏర్పేడు మండలంలో ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి రైతులు వరి పండిస్తే దళారులు కేవలం 1700 రూపాయలకు మాత్రమే కొంటున్నారని, ఇది కూడా 80 కేజీలని చెప్పి 85 కేజీల వరకు దోచుకుంటున్నారని, ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత డిమాండ్ చేశారు.ఏర్పేడు ప రిసర ప్రాంతాల్లో గతంలో చెరకు ప్రధాన పంటగా పండించేవారని, అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం ఐదేళ్లుగా డబ్బు చెల్లించకపోవడంతో వరి పండిస్తున్నారన్నారు. ప్రస్తుతం ధాన్యానికి గిట్టుబాటు లేదన్నారు. ఏర్పేడు పరిసర ప్రాంతాల్లో వరి ధాన్యం పండించిన రైతులను కలిసి వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు రంగయ్య, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

శ్రీవాణి కుటుంబాన్ని ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - పిచ్చాటూరు

అంగన్‌వాడి కార్యకర్తగా పనిచేస్తూ, బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతిచెందిన శ్రీవాణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సిఐటియు నాయకులు మెలుగు రమేష్, నాగలాపురం నాగరాజు, ఆరు వెంకటేష్, రామచంద్రారెడ్డి, మునిశంకర్, అంగన్‌వాడి ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు రాజేశ్వరి, ఇంద్రాణిలు నివాళి అర్పించారు. రెండు దశాబ్దాల పాటు అంగన్‌వాడీగా శ్రీవాణి గ్రామానికి సేవలు అందించారన్నారు. సెక్టార్ లీడర్‌గా అంగన్‌వాడీ కార్యకర్తల హక్కుల కోసం, జీతభత్యాల కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. భజన టీచరమ్మగా చిన్నారులకు పండరీ, కోలాట భజన నేర్పిస్తుండటంతో చిన్నారులు కన్నీటి నివాళి అర్పించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి కోలాట భజన చేసుకుంటూ వచ్చి గజమాలతో టీచర్‌కు నివాళి అర్పించారు.



టాస్క్ ఫోర్స్ సిబ్బందికి మెడికల్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి నిరంతరం శ్రమించే రెడ్ శాండిల్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది క్షేమం కోసం వేసవి దష్ట్యా ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్లు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీ క్యాప్, బెల్టులతో కూడిన కిట్లను టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు గురువారం కార్యాలయ ఆవరణలో అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు బాలిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎండి షరీఫ్, ఆర్ఐ సాయిగిరిధర్, సిఐ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీసిటీ కంపెనీలకు ప్రతిష్టాత్మక సిఐఐ అవార్డులు

ప్రజాశక్తి -వరదయ్యపాలెం

పరిశ్రమల్లో అత్యున్నత భద్రతా ప్రమాణాలను పాటించిన శ్రీసిటీలోని మూడు పరిశ్రమలకు '2024 సిఐఐ ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ ఎక్సలెన్స్ అవార్డ్స్' దక్కాయి. విశాఖపట్నం నోవోటెల్ హెూటల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ మాదిరెడ్డి ప్రతాప్ ఈ అవార్డులను అందచేశారు. శ్రీసిటీకి చెందిన మొండెలెజ్ ఇండియా, కెలాగ్స్, డానియెలి కంపెనీలతో పాటు అదానీ పోర్ట్స్, రామ్కీ గ్రూప్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, కోరొమండల్ తదితర సంస్థలు కూడా ఈ పురస్కారాలను అందుకున్నాయి. విజేతలను మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నగర పరిధిలోని న్యూ బాలాజి కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న స్మశాన వాటికను అభివృద్ధి చేసి, డబుల్ డెక్కర్ బస్సును రోడ్డెక్కించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ను డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు కోరారు. గురువారం డిప్యూటీ మేయర్ ఆర్.సి.ముని కష్ణ, కార్పొరేటర్లు ఎస్.కె.బాబు, నరసింహ ఆచారి, నరేంద్రలు కమిషనర్ ను కలసి పలు అభివృద్ధి పనుల కొరకు వినతి పత్రం సమర్పించారు. న్యూ బాలాజి కాలనీలోని సీకాం కళాశాల వద్ద ఉన్న స్మశానంలో భవన నిర్మాణ వ్యర్థాలు వేయడం, గోడ పడగొట్టి పార్కింగ్‌గా వాడుకుంటున్నారని తెలిపారు. కాంపౌండ్ వాల్ నిర్మించి, శుభ్రంగా ఉంచాలని కోరారు. కార్పొరేషన్ నిధులు వెచ్చించి కొనుగోలు చేసిన డబుల్ డెక్కర్ బస్సును ప్రజల సౌకర్యార్థం నడపాలని, లేకుంటే టిటిడి కి విరాళంగా ఇచ్చేయాలని కోరారు.

ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలి

తిరుపతి టౌన్ : స్వచ్ఛమైన దంతాలను కాపాడుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం చేయాలని ఎంఇఒ బాలకృష్ణనాయక్ అన్నారు.ఎస్‌డి రోడ్డులోని మున్సిపల్ పాఠశాలలో ప్రపంచ ఒఆర్ఎఎల్ ఆరోగ్య దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ప్రదీప్, నజ్మాఆజం, గుణశేఖర్, ప్రత్యూష, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను అడ్డుకునేందుకు వైసీపీ యత్నం, అరెస్టు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి పర్యటనను అడ్డుకునే ప్రయత్నం చేసిన వైసీపీ నియోజకవర్గ ఇంచార్జి భూమన అభినయ్ ని పోలీసులు అరెస్ట్ చేశారు. పద్మావతి పురంలోని ఆయన నివాసం వద్ద గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎయిర్పోర్టులో కలిసి నిలదీయాలని బయలుదేరిన భూమన అభినయ్ రెడ్డి, ఆ పార్టీ నాయకులను పోలీసులు బారికేడ్లు ఉంచి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అభినయ రెడ్డి మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం ఎప్పుడు అమలు చేస్తారని అడిగినందుకు పోలీసులు అరెస్టు చేశారని, దయచేసి మిమ్మల్ని కలిసే అవకాశం కల్పించాలన్నారు. దాదాపు గంటసేపు పోలీసులకు, వైసిపి నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

తిరుమలలో భక్తుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో భక్తుల మధ్య పరస్పరం గొడవ చెలరేగింది. సిఆర్వో వద్ద కుర్చీ కోసం చెలరేగిన గొడవ ఘర్షణకు దారితీసింది. తమిళనాడుకు చెందిన కార్తికేయ కుమారుడిని బళ్ళారికి చెందిన గోవిందరాజులు తోసివేయడంతో కోపంతో కార్తికేయ గాజు బాటిల్‌తో దాడి చేశాడు. బళ్ళారికి చెందిన భక్తుల కుటుంబాన్ని గాయపరిచాడు. వెంటనే అక్కడ ఉన్న విజిలెన్స్ సిబ్బంది గాయపడిన వారిని ప్రథమ చికిత్స నిమిత్తం అశ్విని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు. తిరుమలలో గాజు బాటిళ్లు ప్రవేశపెట్టిన తరువాత నాలుగైదు దాడులు జరగడం గమనార్హం. గాజు బాటిల్ వివాదాలు తరచూ జరుగుతున్నాయని, గాజుబాటిల్ బదులు గతం లో మాదిరి ప్లాస్టిక్ బాటిళ్లనే కొనసాగించాలని కొందరు భక్తులు కోరుతున్నారు. అయితే తిరుమల తిరుపతి దేవస్థానం ప్లాస్టిక్ వల్ల అనర్థాలను దృష్టిలో ఉంచుకుని, గాజు బాటిళ్లను ప్రవేశపెట్టింది. అయితే ఈ గాజు బాటిళ్లను భక్తులు ఆయుధాలుగా ఉపయోగించడం ఓ రకంగా భక్తుల్లో కలవరం నెలకొంది.

ఆకతాయిల ఆగడాలు అరికట్టాలి : ఐద్వా

తిరుపతి టౌన్ : సుందరయ్యనగర్‌లోని బాలాజీ దోబీఘాట్‌లో మూడు రోజులుగా గంజాయి మత్తులో కొంతమంది ఆకతాయిలు బీరు బాటిళ్లు పగలగొట్టి, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, రాళ్లు రువ్వుతూ వీరంగం సృష్టిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సాయిలక్ష్మి డిమాండ్‌చేశారు. ఈస్ట్ సిఐ దృష్టికి తీసుకెళ్లగా డిఎస్‌పి బాలాజీ దోబీఘాట్‌ను సందర్శించారు. ఆగడాలు అరికట్టడానికి బుక్‌పాయింట్లు పెడతామని, పేర్లు చెబితే వారిని తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం మహిళలకు 'శక్తి' యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, నరేంద్ర, వెంకటముని, రంగయ్య, మునిరత్నం, రవి పాల్గొన్నారు.





ప్రాచీన భాషను సంరక్షిద్దాం

సంస్కృత వర్సిటీ స్నాతకోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - క్యాంపస్

సంస్కృత భాషాధ్యయన-అధ్యాపనంలో భారతదేశంలోనే సుప్రసిద్ధమైన జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం నాల్గవ దీక్షాంత సమారోహం మహతి ఆడిటోరియంలో అత్యంత వైభవంగా గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయం కులాధిపతి, పద్మభూషణ బిరుదాంకితులు ఎన్.గోపాలస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పద్మశ్రీ బిరుదాంకితులు, తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం పూర్వకులాధిపతులు, ఆర్థికవేత్త, సంస్కృత విద్వాంసులు, డాక్టర్ వి.ఆర్. పంచముఖి ముఖ్య అతిథిగా ఆన్లైన్లో విచ్చేశారు. విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి విశ్వవిద్యాలయం స్థితిగతులు, గత సంవత్సర కాలంలో చేసిన ప్రగతిని వివరించారు. ఈ స్నాతకోత్సవం సందర్భంగా 75 మంది విద్యార్థులకు విద్యావారిధి (పి.హెచ్.డి) పట్టాలను, ఆచార్య, ఎం.ఏ, ఎం.ఎస్సి, బి.ఏ, బి.ఎస్.సి, ఎం.ఎస్సి యోగాథెరపి, సర్టిఫికెట్, డిప్లమో ప్రమాణపత్రాలను విద్యార్థులు అందుకున్నారు. మొత్తం ఈ సంవత్సరంలో వివిధ కోర్సులలో అర్హత పొందిన 565 మంది విద్యార్థులు పట్టభద్రులయ్యారని హర్షం వ్యక్తం చేశారు. ప్రాచీన సంస్కత భాషను సంరక్షిస్తూ, ఆధునిక వైజ్ఞానిక తత్వాలను అనుసంధానిస్తూ, భారతీయ జ్ఞాన పరంపరను భావిభారతావనికి అందిస్తున్న ఉత్తమ సంస్కత క్షేత్రం తిరుపతిలోని జాతీయ సంస్కత విశ్వవిద్యాలయమని కీర్తించారు.రామానుజ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సురపురం శ్రీనివాసాచార్య రచించిన సిద్ధాంత చింతామణి గ్రంథాన్ని ప్రొఫెసర్ కెఇ దేవనాథన్ ఆవిష్కరించారు.

విద్యార్థులకు బంగారు పతకాలు

విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ముఖ్యాతిథులచే బంగారు పతకాలు అందించారు. ప్రాక్-శాస్త్రిలో ప్రథమస్థానంలో నిలచి బంగారు పతకాన్ని లక్ష్మీప్రసన్న అందుకుంది. శాస్త్రి (డిగ్రీ) స్థాయిలో ఓవరాల్ టాపర్ గా వై.జానకి బంగారు పతకాలు సాధించారు. ఆచార్య (పి.జి) స్థాయిలో ఓవరాల్ టాపర్ గా వచ్చిన అమిత విక్రమ్ కె.ఎస్ బంగారు పతకాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.వెంకట నారాయణరావు, అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత శుక్లా పాల్గొన్నారు.

టీటీడీలో ప్రమోషన్లపై నిషేధం ఎత్తేయాలి : సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుమల తిరుపతి దేవస్థానంలో గత నాలుగేళ్లుగా అనధికారికంగా కొనసాగుతున్న ప్రమోషన్లపై నిషేధాన్ని ఎత్తివేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. టీటీడీలోని అన్ని విభాగాలలో, అన్ని క్యాడర్లలో ప్రమోషన్లు గత నాలుగేళ్లుగా నిలిపేశారని, కారణాలను ఏ ఒక్కరూ తెలియజేయడం లేదని, తక్షణం అప్రకటిత నిషేధాన్ని తొలగించి టీటీడీలోని అన్ని కేడర్ల లోని పర్మినెంట్ ఉద్యోగులకు ఉద్యోగోన్నతిని కల్పించాలని కోరారు. గురు, శుక్రవారాలలో ముఖ్యమంత్రి తిరుమల పర్యటన ఉన్న నేపథ్యంలో ఈ సమస్యపై సానుకూల నిర్ణయం చేసి ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

శానిటరీ మేస్త్రీపై దాడిని సిఐటియు ఖండన

తిరుపతి టౌన్ : నగర పాలక సంస్థ పరిధిలోని 16వ వార్డులో విధులు నిర్వహిస్తున్న శానిటరీ మేస్త్రి కల్లూరు తులసీరామ్‌పై గుర్తు తెలియని దుండగులు కత్తితో దాడి చేయడం దుర్మార్గమని సిఐటియు నగర కార్యదర్శి వేణుగోపాల్ ఖండించారు. ఉదయం ఏడు గంటలకు డిఆర మహల్ రోడ్డులో విధులు నిర్వహిస్తున్న తులసీరామ్‌పై నలుగురు దాడిచేశారు. తలపై, చేతులపై కత్తితో పొడవడంతో స్థానికుల సమాచారం మేరకు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ఉన్న మేస్త్రిని నాయకులు టి.సుబ్రమణ్యం, పి.బుజ్జి, పి.చిన్న పరామర్శించారు. ఈ ఘటన మున్సిపల్ కార్మికులను భయాందోళన కలిగించేలా ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణం దాడికి పాల్పడినవారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నాళ్లని...ఎన్నేళ్లని..


'దిష్టి'బొమ్మల్లా...పక్కా ఇళ్లు

వెక్కిరిస్తున్న పునాదిరాళ్లు



'ప్రతి ఒక్కరికీ సొంతిల్లు కట్టించి ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యం.. స్థలం లేని వారికి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తాం' అని కూటమి ప్రభుత్వ హామీ.. గతంలో వైసిపి హయాంలోనూ అప్పటి పాలకులూ కొంచెం అటూఇటూ ఇవే మాటలు చెప్పారు.. అయితే ఇప్పటికీ దళిత గిరిజన వాడలకు వెళితే గుడిసెలే దర్శనమిస్తాయి. వారికి సొంతిల్లు కలే మరి.. ఎన్నాళ్లకు, ఎన్నేళ్లకు పాలకుల హామీలు నెరవేరుతాయో మరి. సరిగ్గా ఇంకా ఎన్నికలు వస్తాయనగా ప్రకటించడం, ప్రభుత్వాలు మారితే ఆ హామీ అటకెక్కడం షరామామూలయ్యింది. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం సర్వేల పరంపర సా..గుతూనే ఉంది.

ప్రజాశక్తి - కెవిబిపురం



కెవిబిపురం మండలంలో 39 పంచాయతీల్లో 2014-19 మధ్యకాలంలో 586 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో పూర్తయినవి 153. మిగిలినవి వివిధ రకాల స్టేజిల్లో 433 వరకూ ఉన్నాయి. వైసిపి హయాంలో 2019లో 634 ఇళ ఇచ్చారు. అందులో ఇప్పటికి 220 పూర్తయ్యాయి. గత ప్రభుత్వం లక్షా 80వేలు మాత్రమే లబ్దిదారులకు ఇచ్చింది. అయితే ఆ డబ్బులూ ఏ మూలకూ సరిపోలేదని లబ్దిదారులు వాపోతున్నారు. అందుకే ఇళ్లను పూర్తి చేయలేకపోతున్నామన్నది వారి ఆవేదన. గ్రామాల్లో సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందించాలని వారు కోరుతున్నారు. ఓ వైపు వైసిపి కేటాయించిన ఇంటి స్థలం ఎటూ చాలని పరిస్థితి. మరోవైపు కూటమి ప్రభుత్వం అడుగు ముందుకు పడలేదన్నది లబ్దిదారుల ఆవేదన. తాజాగా కూటమి ప్రభుత్వం ఇల్లు పూర్తి చేసుకోడానికి రూ.50వేల నుంచి లక్ష రూపాయల వరకు ఆర్థిక సాయం అందిస్తామని చెబుతూ, నిబంధనలు విధిస్తోంది. అయితే ఈ సాయం ఏ మూలకు వస్తుందని లబ్దిదారులు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం మాటలు నమ్మి, అప్పోసప్పో చేసి ఇల్లు కడితే, ప్రభుత్వం డబ్బులు ఇస్తుందో లేదోననే భయమూ వారికి లేకపోలేదు. బ్రాహ్మణపల్లి సుజాత 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ప్రభుత్వం లక్షా 80వేలు ఇచ్చిందని, అయితే ఇల్లుపూర్తవ్వడానికి ఐదు లక్షలు అప్పు చేయాల్సి వచ్చిందని పేర్కొంది.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి : నాగరాజు, సిఐటియు




మండలంలో ఇప్పటికి ఇంటి స్థలాలు లేక, ఇళ్లు లేక నిరుపేద కుటుంబాల్లో గుడిసెల్లోనే కాపురం ఉంటున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం కేటాయించి, ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం అందించాలి. వైసిపి హయాంలో ఇచ్చిన ఇళ్లు పూర్తయ్యేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రస్తుత ధరలు పెరిగిన నేపథ్యంలో కనీసం రూ. 5 లక్షలైనా ఇవ్వాలి. లేదంటే ప్రభుత్వమే పూర్తిస్థాయిలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

30 ఏళ్లుగా గుడిసెలోనే : రంగమ్మ, ఎస్టీ కాలనీ, దిగువ పుత్తూరు



నేను 30 ఏళ్లుగా దిగువ పుత్తూరు ఎస్టీ కాలనీలోనే నివాసం ఉంటున్నాను. నాకు ఇంటి స్థలం ఉన్నా, ఇప్పటివరకు ఇల్లు కట్టుకునేందుకు అధికారులు నన్ను గుర్తించలేదు. అందుకే ఇప్పటికీ పూరి గుడిసెలోనే నివాసం ఉంటున్నాను. వర్షాకాలం వస్తే ఉండటానికి చోటు లేక నేను నా పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. హౌసింగ్ అధికారులు స్పందించి ఇల్లు నిర్మించుకునేందుకు రుణం ఇవ్వాలి. అధికారుల చుట్టూ తిరుగుతున్నా. పట్టించుకోవడం లేదు. 30 ఏళ్లుగా గుడిసెలోనే ఉంటుంటే, అధికారులు లబ్దిదారులుగా ఎవరిని గుర్తిస్తున్నారో అంతుచిక్కడం లేదు.

ఇళ్లకు అదనపు ఆర్థిక సాయం దినేష్, హౌసింగ్ ఎఇ



2014-19లో టిడిపి హయాంలో 586 ఇళ్లు మంజూరు చేయగా, అందులో 153 పూర్తయ్యాయి. వైసిపి హయాంలో 1817 మంజూరు కాగా అందులో 1067 బిల్లులు పూర్తయ్యాయి. ఇంకా 750 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. అప్పట్లో ఒక్కో ఇంటికి లక్షా 80వేలు మంజూరు చేశారు. ఇపుడు కట్టుకునే వారికి ఎస్సీ, బీసీ లబ్దిదారులకు రూ.50వేలు, ఎస్టీలకు 70వేలు కూటమి ప్రభుత్వం ఇవ్వనుంది. అందుకు అర్హులైన వారు మండలంలో 626 మంది ఉన్నారు. ఎస్సీలు 291 మంది, బీసీలు 245 మంది, ఎస్టీలు 90 మంది ఉన్నారు. వీరందరికీ ఇళ్లు పూర్తయితే బిల్లులు పడుతున్నాయి. ఇళ్లు కట్టుకోని వారు ఎవరైనా ఉంటే వెంటనే కట్టుకుంటే బిల్లులు పడతాయి.

తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులు తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని తహశీల్దార్ చాంబర్ ముందు కూర్చొని నిరసన తెలిపారు. సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి సమస్య పరిష్కారానికి శిబిరానికి వస్తానని చెప్పి రాకపోవటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నిరాజ్ మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ రెవెన్యూలోని 252, 253, 254 సర్వే నెంబర్లలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని ఇంటి స్థలాలకోసం స్వాధీనం చేసుకున్నామని, స్వాధీనం చేసుకున్న భూమికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 9 రోజులుగా ఇంటి పట్టాల కోసం దీక్ష చేస్తున్నా ఆర్డీఓ పట్టించుకోకపోవటం దారుణమన్నారు. ఇకనైనా స్పందించక పోతే ఆందోళన మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఇంటి పట్టాలు ఇచ్చే వరకు రిలే నిరాహార దీక్షను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య వారి బృందం, సీపీఐ మండల కార్యదర్శి ధర్మయ్య, గ్రామస్తులు రమణయ్య, సుబ్రమణ్యం, వీరాస్వామి, గుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూలే దంపతుల విగ్రహాల ప్రాంగణాన్ని పునరుద్ధరించాలి



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీ, ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాల ప్రాంగణాన్ని పునరుద్ధరించాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షులు అజ్జలపాటి మస్తాన్ కోరారు. గురువారం ఆయన సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయుడుపేట బస్టాండ్ ఆవరణంలో గల పూలే దంపతుల విగ్రహాల ప్రాంగణం అధ్వాన్నంగా తయారై దుర్గంధం వెదజల్లుతూ జుగుప్సాకరంగా తయారైందన్నారు. పక్కనే ఉన్న డ్రైనేజ్ కాలువ గోడలు కూలిపోయి అధ్వాన్నంగా ఉన్నాయని మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎస్.రామయ్య, మండల అధ్యక్షులు వినుకొండ శివ, టౌన్ అధ్యక్షులు అవుల వినోద్, నియోజకవర్గ కమిటీ సభ్యులు ముద్దపాటి బాలాజీ, ఎన్.కె.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ఏపీ అసెంబ్లీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రజా సమస్యలపై మరోసారి తన గళాన్ని వినిపించారు. గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలలో రైతులు, రెవెన్యూ శాఖ నుండి భూములకు పట్టాలు పొంది, అభివృద్ధి చేసుకొని సాగు చేసుకుంటున్నారన్నారు. ఆ భూములను రిజర్వు ఫారెస్ట్ పరిధిలోకి వస్తాయని అధికారులు ఉన్నపళంగా లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతులు విద్యుత్ శాఖ నుండి విద్యుత్ స్తంభాలు, మీటర్లను సైతం ఏర్పాటు చేసుకొని సాగు చేసుకుంటున్నారని ఎమ్మెల్యే సభలో వివరించారు. ఈ సమస్యతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులు ఎక్కువగా నష్టపోతున్నారని వివరించారు. పట్టా పొందిన వారి భూములను పరిరక్షించాలని, ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. శ్రీసిటీ రోడ్డు వేయడానికి ఫారెస్ట్ భూములు అంటూ అభ్యంతరం తెలిపితే, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి రూ.6.00 లక్షల నిధులు మంజూరు చేసి దారి సౌకర్యం కల్పించడం జరిగిందని వివరించారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి వేడుకలను ప్రభుత్వం వారోత్సవంలా, అధికారికంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోరారు.


ఎంఆర్ఎఫ్‌లో ఉద్యోగాలకు జాబ్ డ్రైవ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ పరిధి, గోవిందపాలెం, శ్రీ విద్యా డిగ్రీ కళాశాలలో తిరుత్తణి దగ్గర గల ఎంఆర్ఎఫ్ టైర్ల తయారీ కంపెనీలో డిగ్రీ, డిప్లమో, ఇంజినీరింగ్ పూర్తయిన పురుష అభ్యర్థులకు రేపు జాబ్ డ్రైవ్ నిర్వహించబడుతుందని కళాశాల చైర్మన్ డాక్టర్ జి.ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9442116931, 99660 00801 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రేపు డిఆర్‌డబ్ల్యు కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డిఆర్‌డిఎ సంయుక్త ఆధ్వర్యంలో రేపు గూడూరు, డిఆర్‌డబ్ల్యు కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత రావులు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. పది, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసినవారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9700561225 నంబరును సంప్రదించాలన్నారు.

గేట్ విజేత సుజనకు అభినందన



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆల్ ఇండియా గేట్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా మూడు లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఒక లక్ష మంది ఉత్తీర్ణత సాధించారు. పుత్తూరు, నగరి దేశపువారు చెందిన ఆదారి సుబ్రహ్మణ్యం, పార్వతి దంపతుల కుమార్తె సుజన ఆల్ ఇండియా లెవెల్ గేట్ పరీక్షలో 881 ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

చెరువు చుట్టూ మొక్కలు తొలగింపు



పరిసరాలను శుభ్రం చేయిస్తున్న గ్రామ సర్పంచ్ మణిరాజు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, ఎస్.బి.ఆర్ పురం గ్రామ పంచాయతీలోని ఆదిఆంధ్ర సమీపంలో గ్రామం చుట్టూ చెరువు నీరు నిలవడంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పాములు, విషపు క్రిమి కీటకాలు, రాత్రింబగళ్లు తరచూ ఇళ్లలోకి వస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మణి రాజు జెసిబి సాయంతో పిచికారి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్ర పరిచారు.

తరిగిపోతున్న వన్యప్రాణులు

- ఆహారం లేకనే జనారణ్యంలోకి పులులు
- ఇలానే ఉంటే రాబోయే పరిస్థితి భయానకం
- ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి కథనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాయలసీమ పరిధిలో ఐదు జిల్లాలకు విస్తరించి ఉన్న శేషాచలం అడవుల విస్తీర్ణం కొద్దికొద్దిగా అన్యాక్రాంతమవుతూ అటవీ భూభాగం రోజురోజుకూ తరిగిపోతోంది. ఇదే క్రమంలో అడవిలో స్వేచ్ఛాయుత జీవితాన్ని గడపాల్సిన వన్యప్రాణులు వేటగాళ్ల ఉచ్చులకు, రైతు పంట పొలాల వద్ద ఏర్పాటు చేసే విద్యుత్తు తీగలకు, అడవిలో క్రూరమృగాలకు, ఎర్రచందనం స్మగ్లర్లకు ఆహారమవుతూ వివిధ రకాల వన్యప్రాణులు వాటి సంతతిని శేషాచలం అడవులలో కోల్పోతున్నాయి. గడిచిన నాలుగు దశాబ్దాల కాలంగా శేషాచలం అడవులలో మాత్రమే విరివిగా లభించే ఎర్రచందనం స్మగ్లర్లు అక్రమంగా రవాణా చేస్తూ అడవిలో పచ్చదనాన్ని స్మగ్లర్లు దెబ్బతీస్తున్నారు. నెలల తరబడి అడవుల్లో ఉంటున్న స్మగ్లర్లు ఆహారం నిమిత్తం వన్యప్రాణులను వేటాడి తింటున్నారని సమాచారం. ఇదే క్రమంలో ఈ పరిస్థితుల నుండి ఆహారం కోసం జనారణ్యంలోకి వచ్చే వన్యప్రాణులు కుక్కల దాడిలో, పంట పొలాలను నాశనం చేస్తున్నాయని అడవి జంతువుల నుండి రక్షణ పొందడానికి రైతులు ఏర్పాటు చేసుకునే విద్యుత్తు తీగలకు బలైపోతున్నాయి.

అటవీ సరిహద్దు ప్రాంతాలలో..

శేషాచలం అడవులను ఆనుకుని వందల వేల సంఖ్యలో అటవీ సరిహద్దు గ్రామాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలలో కొంతమంది వేటగాళ్లు రిజర్వు ఫారెస్ట్‌లోకి ప్రవేశించి అక్రమంగా అడవి జంతువులను వేటాడడానికి ఉచ్చులు వేస్తూ వేట కొనసాగిస్తున్నారు. అడపాదడపా అటవీ శాఖ అధికారుల అప్రమత్తత దాడులతో వేటగాళ్లు అడవి వైపు రావడం తగ్గిందనే చెప్పాలి. అడవులలో సరైన ఆహారం, నీటి లభ్యత లేమి కారణంగా జింకలు, దుప్పులు, అడవి పందులు, కుందేళ్లు, నల్లబిల్లి (ప్రాంతీయ వాడుక భాషలో నల్లబిల్లి, అంతరించిపోతున్న జాతులలో ఉన్నది) ఇవి పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదము ఉంది.

పచ్చదనాన్ని కోల్పోతున్న శేషాచలం..


రాయలసీమ పరిధిలో విస్తరించి ఉన్న శేషాచలం అడవి రోజురోజుకు పచ్చదనాన్ని కోల్పోతుంది. తిరుమలలో 70 శాతం పచ్చదనం ఉంది కాబట్టే ఆ ప్రాంతం చల్లగా ఉందని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సంచరించుకుందని చెబుతున్న పాలకులు రోజురోజుకీ తిరుమలలో అతిథి గృహాల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో తరిగిపోతున్న పచ్చదనాన్ని గురించి మాట్లాడే వారే లేరు. సౌకర్యాల కల్పనలో భాగంగా తిరుమలలో కొన్నేళ్లకు ముందు ఏర్పాటు చేసిన ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో వేల సంఖ్యలో చెట్లు నరకడం పట్ల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. భూమిపై రోజురోజుకీ పచ్చదనం తరిగిపోతున్న నేపథ్యంలో, పచ్చదనాన్ని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోంది. అందరూ భాగంగానే మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారు.

కార్చిచ్చులతో..

శేషాచలం అడవిలో ఏర్పడే కార్చిచ్చుల మూలంగా ఏటా హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ భూభాగం అగ్నికి ఆహుతి అయిపోతుంది. ఇదే క్రమంలో పశుపక్షాదులు ఏర్పాటు చేసుకున్న గుళ్ళు, కుందేళ్లు కాలిపోతున్నాయి. అటవీ శాఖ ఆధ్వర్యంలో అటవీ భూభాగాన్ని రక్షించే చర్యలలో భాగంగా శేషాచలం పరిధిలో ఏటవాలు కొండలు, వివిధ రకాల అడవులను ఫైర్ లైన్స్ ఏర్పాటు చేసి రక్షించే ప్రక్రియ చేస్తున్న నామమాత్రంగానే ఫలితాలు ఉన్నాయని చెప్పాలి. అగ్ని కీలలకు గాలి తోడవడంతో ఆపడానికి వీలు లేక గతంలో తిరుమల తూర్పు వైపున క్షేత్రపాలకుడి సమీప కొండలపై హెలికాప్టర్లతో మంటలను అదుపు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

పరిస్థితులు ఇలానే కొనసాగితే..

శేషాచలం అడవులలో పచ్చదనాన్ని పరిరక్షించడానికి అటవీ శాఖ కట్టుదిట్టమైన చర్యలను తీసుకొని దాని అమలుకు శ్రీకారం చుడితే తప్ప తిరుమలతో పాటు శేషాచలం అడవుల పచ్చదనాన్ని భావితరాలకు అందించిన వారమవుతాము. లేక పరిస్థితులు ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో పరిస్థితుల్లో మానవ జీవితంలో చాలా మార్పులు చోటు చేసుకుంటాయి. భూమి ఉష్ణోగ్రత రోజురోజుకు పెరిగిపోతుందని ప్రపంచ దేశాలు గగోలు పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో కూడా అటవీ సంరక్షణ చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో మనిషి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తెలుస్తోంది. రహదారి వెంట మొక్కల నాటి ఫోటోలు తీసుకుని ప్రజాప్రతినిధులు, అదే మొక్కలను చెట్లుగా ఎదిగిన తరువాత రహదారి విస్తరణ పేరుతో వేల సంఖ్యలో చెట్లను నరికి వేస్తున్నారు. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతగా నెరవేరుస్తూ వాటిని వృక్షాలుగా ఎదగడానికి అవకాశం ఇవ్వాలి.



గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి -కోట : మహాత్మా జ్యోతిభా పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో చేరుటకు సొసైటీ వారు నిర్వహించే ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకొనుటకు గడువు ఈ నెల 25 వ తేది వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు విద్యా సంవత్సరం 2024-25 లో ఏదైనా పాఠశాలలో 4, 10 వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు కోట బీసీ గురుకులంలో 5 వ తరగతి, ఇంటర్ చేరుటకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27వ తేది నిర్వహిస్తారన్నారు.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రంజాన్‌ను పురస్కరిం చుకొని పేద మహిళలకు గురువారం దర్గా వీధి లోని తమ నివాసంలో లయన్ షేక్ రియాజ్ అహ్మద్ తల్లిదండ్రులు షేక్ వజీర్ అహ్మద్, ఖాదర్‌బిల జ్ఞాపకార్థం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో దానధర్మాలను చేయాలని జకాత్ ఫిత్రాలను పేదలకు అందించాలని ఇది ఇస్లాం సారాంశంమని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ షేక్ రియాజ్ అహ్మద్, దర్గా వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ మొహమ్మద్ మగ్దూమ్ మొహిద్దీన్, షేక్ ఇలియాజ్ అహ్మద్, షేక్ హఫీజ్ అహ్మద్,షేక్ నూర్ అహ్మద్, మనవడు షేక్ మొహమ్మద్ హుస్సేన్,షేక్ కాలేషా, షేక్ చాన్ బాషాలు పాల్గొన్నారు.

'అవని' డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

చంద్రగిరి డిసిసి బ్యాంక్ మేనేజర్ సంకీర్తనశ్రీ



ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కొత్తగా తీసుకొచ్చిన అవని డిపాజిట్ పథకం మహిళలకు ఒక వరమని తిరుపతి జిల్లా, చంద్రగిరి డిసిసి బ్యాంక్ మేనేజర్ సంకీర్తనశ్రీ అన్నారు. గురువారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ అవని డిపాజిట్ పథకం కేవలం మహిళలకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ పథకంలో డిపాజిట్ చేసుకున్న వారికి డిసిసిబి అత్యధికంగా 8.30 శాతం బ్యాంకు వడ్డీ చెల్లిస్తుందన్నారు. అదే సీనియర్ సిటిజన్ మహిళలకు అయితే 8.40 శాతం వడ్డీ వస్తుంది అన్నారు. అవని డిపాజిట్ పథకం కాలపరిమితి 333 రోజులుగా బ్యాంకు యాజమాన్యం నిర్ణయించిందని పథకంలో కనిష్ట డిపాజిట్ 10,000 నుంచి స్వీకరిస్తామని ఆమె తెలిపారు. తమ బ్యాంకులో అవని డిపాజిట్ పథకంలో డిపాజిట్ సొమ్ముకు డిసిసిబి ఇన్సూరెన్స్ రక్షణ కూడా కల్పిస్తుందన్నారు. డిపాజిట్ స్వీకరణ మార్చి 7వ తేదీ నుంచి ప్రారంభమైందని పథకానికి 2025 మార్చి 31 తుది గడువు అని వివరించారు.

సచివాలయం వద్ద ఎమ్మెల్యేని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి -కోట : అసెంబ్లీలో కోట పట్టణ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే పాశిం సునిల్ కుమార్‌ను కోట మండల తెలుగుదేశం నాయకులు గురువారం తాడేపల్లి సచివాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగుదేశం మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, వెంకన్నపాలెం సర్పంచ్ కోకర్ల మధు యాదవ్, కోట ఎంపీటీసీలు దారా సురేష్, షేక్ షంషుద్దీన్ పాల్గొన్నారు.

తిరుపతిలో విస్తృతంగా స్విగ్గీ బోల్ట్ సేవలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రముఖ మార్గదర్శిక అన్ డిమాండ్ సౌలభ్య వేదిక స్విగ్గీ వినియోగదారులకు ప్రత్యేకమైన బోల్ట్ సేవలు అందించనుంది. తిరుపతిలో గణనీయమైన వృద్ధిని సాధించినట్లు స్విగ్గీ ఫుడ్ మార్కెట్ ప్లేస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సిధార్థ్ భకూ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్విగ్గీ శీఘ్ర ఆహార డెలివరీ సేవ బోల్ట్ తిరుపతి నగరంలో పెద్ద ఎత్తున వృద్ధిని నమోదు చేసిందన్నారు. వినియోగదారులు తమ సేవలను మరింత వినియోగించుకోవాలని కోరారు.

పల్లం స్కూల్లో స్టెమ్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి- ఏర్పేడు : పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టెమ్ ల్యాబ్‌ను డిఇఓ కుమార్ చేతుల మీదుగా క్రై సంస్థ సహకారంతో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రేమలత, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నారాయణ, ప్రగతి సంస్థ సభ్యులు, అధ్యాపక బృందం, నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

మెకానిక్స్ సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని టూ వీలర్స్ మెకానిక్స్, వారి కుటుంబాల సంరక్షణ లక్ష్యంగా సంక్షేమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని శ్రీబాలాజీ టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ పేర్కొన్నారు. ఆ సంఘం నెలవారి సమావేశం గురువారం యూత్ హాస్టల్ ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశంలో బోస్ కంపెనీ ప్రతినిధులు విచ్చేసి మెకానిక్ బైక్ సర్వీస్ పాయింట్‌పై అవగాహన కల్పించి, లేబర్ లైసెన్సులు అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్స్‌కు అందజేశారు. ఈ సమావేశంలో సెక్రటరీ వి.ఎస్ హరిప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ చందు, ట్రెజరర్ ఎస్ షఫీ, జాయింట్ సెక్రెటరీ వి ఆనంద్, సలహాదారుడు ఏ ఎమ్ గోపి, కమిటీ సభ్యులు మధు కుమార్ ప్రసాద్ జాకీర్ గోపి విశ్వనాథ్ తో పాటు వ్యవస్థాపకులు ఎన్ఆర్ భాష, కృష్ణారెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - క్యాంపస్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవడం పట్ల తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్ ఈరోజు అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఛాంబర్‌లో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

31 లోగా ఈకేవైసీ చేసుకోండి

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలో రేషన్ కార్డు కలిగిన కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ రేషన్ కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం (ఈకేవైసీ) చేయించుకోకపోతే రేషన్ కట్ అవుతుందని తహసిల్దార్ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో 2300 మంది ఈ కేవైసీ చేసుకోవాల్సి ఉందని ఆయన తెలిపారు.

ఏర్పేడులో వాణిజ్య సముదాయాల అద్దెలు తగ్గించండి

ప్రజాశక్తి- ఏర్పేడు: మండల కేంద్రమైన ఏర్పేడులో వ్యాపారాలు పూర్తిగా తగ్గిపోయాయని, తిరుపతి శ్రీకాళహస్తి జాతీయ హైవే ఏర్పాటు, ఏర్పేడు -వెంకటగిరి మార్గంలో ఏర్పేడు వద్ద ఆర్ఓబి ఏర్పాటుతో వ్యాపారాలు పూర్తిగా లేవని ఏర్పేడుకు చెందిన వ్యాపారస్తులు పలువురు డిఎల్పిఓ ప్రభు రెడ్డికి మొరపెట్టుకున్నారు. ఐఐటి, ఐజర్‌ల భవనాల నిర్మాణాల కార్మికులు సైతం భవనాలు పూర్తితో వెళ్లిపోవడంతో వ్యాపారాలు లేకుండా పోయాయని, పంచాయతీ రూముల అద్దెలు చెల్లించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏర్పేడు సర్పంచ్ సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాల్యం శివయ్యను పంచాయతీ షాపుల అద్దెలు తగ్గించమని కోరారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వ్యాపారులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

యంబియూ అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) చంద్రగిరి మండలంలో ఏ రంగంపేట సమీపంలో ఉన్న సాయినాథ్ నగర్ లోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో డేటా సైన్స్ విభాగం అధ్యాపకుడుగా పనిచేస్తున్న పి బాషాకు కె.యల్ యూనివర్సిటీ డాక్టర్ ప్రధానం చేసింది. ఎ హైబ్రిడ్ వాకింగ్ అసిస్టెంట్ సిస్టం ఫర్ విజువలి ఇన్ ఫైర్డ్ పీపుల్ త్రూ సెన్సార్ అండ్ ఐ ఓ టి పీపుల్ టెక్నలజీస్ అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్ డీ పొందినట్లు చెప్పారు. భాషను ఎంబియూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు, ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు తదితరులు అభినందించారు.

టాటా హిటాచీ ఎక్స్కవేటర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : టాటా హిటాచీ తన తాజా ఈఎక్స్ 350ఎల్సీ ప్రైమ్ ఎక్స్కవేటర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టాటా హిటాచీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) సిద్ధార్థ్ చతుర్వేది మాట్లాడుతూ అధునాతన సాంకేతికత, మెరుగైన పని తీరుతో ఈ కొత్త మోడల్ నిర్మాణ యంత్రాల పరిశ్రమలో కీలకంగా నిలవనుందన్నారు. శక్తివంతమైన ఇంజిన్, హెవీ డ్యూటీ అండర్‌కేరేజ్, 600ఎంఎం జీపీ, హెచ్డీ ట్రాక్ ఎంపికలు అందుబాటులో కలవన్నారు. ఇన్బైట్ 4జీ టెలిమాటిక్ సూట్, యాప్, వెబ్ ఆధారిత మానిటరింగ్ సదుపాయం ఉందన్నారు. ఏడు అంగుళాల టీఎఫ్టీ ఎల్సీడీ మానిటర్, ఇంటిగ్రేటెడ్ రియర్ కెమెరా, ఇంజిన్ ప్రొటెక్షన్ కంట్రోల్ ఉన్నాయన్నారు.

పగబట్టిన పసివాడు

- పెరిగి పెద్దవాడై కక్ష తీర్చుకున్న వైనం
- పాత కక్షలతో శానిటరీ మేస్త్రిపై హత్యాయత్నం
- దారికాచి వేకువ జామున కత్తితో మెరుపు దాడి
- పోలీసుల అదుపులో నిందితుడు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ : పాత కక్షలతో మునిసిపల్ శానిటరీ మేస్త్రి పై ఓ యువకుడు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గురువారం వేకువ జామున దారుకాచి కత్తితో మెరుపు దాడి చేయడంతో తల, చేతిపై తీవ్ర గాయాలైన ఘటన తిరుపతిలో చోటుచేసుకుంది. దశాబ్దం క్రితం కోడి కోసం జరిగిన వివాదం.. నేడు ప్రాణం తీసే స్థాయికి చేరుకుంది. కోడి వివాదం ప్రారంభం అయినప్పుడు చంటి పిల్లోడుగా ఉన్న బాలుడు ప్రస్తుతం మేజర్ అయ్యాడు. అప్పట్నుంచి కక్షపెంచుకుని.. ఎలాగైనా ఎదుటివారిని అంతం చేయాలని నిర్ణయించుకుని, పథకం ప్రకారం హత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే జోరేపల్లి నాగరాజు కుటుంబం, కల్లూరు గంగాధరం కుటుంబం ఎస్‌టివి నగర్ (కొత్త ఇండ్లు)లో పక్కపక్క వీధిలో కాపురం ఉంటున్నారు. పదేళ్ల క్రితం జులాయిగా తిరుగుతున్న నాగరాజు, పక్క వీధిలోని గంగాధరం ఇంటిలో ఉన్న నాటు కోడిని అపహరించాడు. ఈ విషయాన్ని నిలదీసిన గంగాధరం కుటుంబ సభ్యులపై దాడి చేసి గొడవ చేసాడు. దీంతో గంగాధరం కుటుంబం నాగరాజుని పోలీసులకు అప్పగించి, హత్యాయత్నం కేసు పెట్టారు. పోలీసులు నాగరాజును అదుపులో తీసుకుని ఈస్ట్ పోలీస్ స్టేషన్లోని సెల్లు లో ఉంచారు. నిందితుడు నాగరాజు పోలీస్ స్టేషన్ నుంచి తప్పించుకునే ప్రయత్నంలో స్టేషన్ గోడ దుకుతూ ప్రమాదవశాత్తు జారుపడి మృతి చెందాడు. అప్పటికి నాగరాజుకు గౌరీ శంకర్ (9) అనే కుమారుడు ఉన్నాడు. ఆ వివాదం అంతటితో ముగిసింది అని అందరు అనుకున్నారు. మూడు సంవత్సరాల క్రితం కల్లూరు గంగాధరం కూడా అనారోగ్యంతో మృతి చెందాడు. గంగాధరంకు ఇద్దరు కుమారులు, పెద్ద కుమారుడు నాని, చిన్న కుమారుడు తులసీరామ్. చిన్న కుమారుడు తులసీరామ్ తిరుపతి కార్పొరేషన్ శానిటరీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. మరోపక్క నాగరాజు కుమారుడు గౌరీ శంకర్ తండ్రి చనిపోయిన తర్వాత పదేళ్ల వయసులోనే చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ.. జులాయిగా తిరుగుతుండేవాడు. అనేకసార్లు పోలీసులకు పట్టుబడి బాల నేరస్తులు గృహంలో శిక్ష అనుభవించాడు. తన తండ్రి చావుకు కారణం గంగాధరం కుటుంబమే అని భావించి, అప్పటి నుంచి వారిపై కక్ష పెంచుకున్నాడు. మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడిన గౌరీశంకర్ గంగాధరం కుటుంబంపై కక్ష తీర్చుకునేందుకు అదును కోసం ఎదురుచూస్తున్నాడు. గురువారం వేకువ జామున నాలుగు గంటలకు గంగాధరం చిన్న కుమారుడు తులసీరామ్ (28) విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి, డిఆర్ మహల్ మార్గంలో విధులు నిర్వహిస్తుండగా గౌరీ శంకర్ గంజాయి సేవించి, పథకం ప్రకారం తులసిరాంపై కత్తితో దాడి చేశాడు. మెరుపు దాడి నుండి చేరుకున్న తులసిరామ్ గౌరీ శంకర్ అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. అప్పటికే తులసిరాంపై కత్తితో నాలుగు ఐదు సార్లు దాడి చేయడంతో తలపై, చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వారు గట్టిగా కేకలు వేయడంతో గౌరీ శంకర్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. స్థానికుల అతన్ని పట్టుకొని, ఈస్ట్ పోలీసులకు అప్పగించారు. ఆ సమయంలో నిందితుడు వద్ద సుమారు కేజీకి పైగా గంజాయి ఉన్నట్లు సమాచారం. తీవ్ర గాయాల పాలైన తులసీరాంను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈస్ట్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని, సెక్షన్ 307 కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

క్రైం న్యూస్

రెవిన్యూ కార్యాలయంలో కంప్యూటర్ చోరీ

ప్రజాశక్తి - ఓజిలి : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో కంప్యూటర్ చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది ఎప్పటిలాగే మంగళవారం విధులు పూర్తిచేసుకుని కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లారు. బుధవారం ఉదయం తాళాలు తెరిచి చూడగా వీఆర్వో ఉపయోగిస్తున్న కంప్యూటర్ చోరీకి గురైందని గుర్తించారు. ఈ విషయమై గురువారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో విలువైన కంప్యూటర్లు, ప్రింటర్, లాప్టాప్‌లు ఉండగా కేవలం వీఆర్వో కంప్యూటర్ మాత్రమే చోరీకి గురికావడం అనుమానాలకు తావు ఇస్తోంది.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి



మృతి చెందిన యనమల బాలకృష్ణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రైలు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గూడూరు రైల్వే స్టేషన్ సమీపంలోని ఉత్తరం వైపు డౌన్ లైన్ వద్ద చోటు చేసుకుంది. గూడూరు రైల్వే పోలీసుల కథనం మేరకు మృతుడు గూడూరు రెండో పట్టణానికి చెందిన యనమల బాలకృష్ణ(40)గా గుర్తించామన్నారు. రైలు పట్టాలు దాటే సమయంలో రైలు ఢీ కొనడంతో మృతి చెందాడన్నారు. ఇతను గూడూరు రైల్వేలో కీ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు పూతలపట్టు-నాయుడుపేట ప్రధాన రహదారిలోని తిరుపతి రూరల్ వేదాంతపురం పంచాయతీ, భీమవరం రుచులు హోటల్ సమీపంలోని ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి మృతదేహం పడి ఉండడాన్ని గమనించి, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడుకి సుమారు 35 సంవత్సరాల వయసు ఉండవచ్చని, మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగివుండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడిని ఒకరోజు ముందే హత్య చేసి డీ కంపోస్ అయిన మృతదేహాన్ని ఇక్కడ తీసుకొచ్చి పడేశారు. హత్యకు గురైన వ్యక్తి ఆనవాళ్లు కనపడకుండా యాసిడ్‌తో కాల్చివేశారని పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని ఎస్పి హర్షవర్ధన్ రాజు, ఏఎస్‌పి రవి మనోహరాచారి పరిశీలించారు. పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలను సేకరిస్తున్నామని, నేర స్థలానికి సమీపంలో ఉన్న కెమెరాలను పరిశీలిస్తామని పోలీసులు తెలిపారు. మృత దేహం కాళ్లపై, తలపై గాయాలన్నాయని, ఉద్దేశపూర్వంగానే హత్యే జరిగినట్లు భావిస్తున్నామని తెలిపారు. వారం రోజులుగా మిస్సింగ్ కేసులలో ఉన్న వ్యక్తుల వివరాలను పరిశీలిస్తున్నారు.

గురుకుల పాఠశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, బనిగి సాహెబ్ పేటలోని మహాత్మ జ్యోతి భా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్య సంవత్సరానికి 5వ తరగతి (ఇంగ్లీష్ మీడియం) ప్రవేశానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈ.బి.సి అర్హత గల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.

బీటీ రోడ్ ఏర్పాటు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిల్లకూరు మండల పరిధి, వరగలి క్రాస్ రోడ్డు నుండి చింత వరం వరకూ మేఘ ఇంజనీరింగ్ సంస్థ కోటి రూపాయలు వ్యయంతో 25 కి.మీల బీటీ రోడ్డు నిర్మాణ పనులను శరవేగంగా చేయడం అభినందనీయమని స్థానిక ప్రజలు పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ రోడ్డు గుంతల మయంగా మారి వాహనదారులకు ప్రాణ సంకటంగా ఉందని స్థానికులు తెలిపారు. మేఘా ఇంజనీరింగ్ సంస్థ నిర్వాహకులకు వాహన చోదకులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల కెళ్లే లింకు రోడ్లలో ప్యాచ్ వర్క్ చేపడుతున్నారు.

శరవేగంగా ఈద్గా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రధానమైన ఈదులగుంట ఈద్గాలో ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఈద్గా కమిటీ సలహాలు, సూచనలతో ఎక్కడా ఎటువంటి ఇబ్బంది కలుగకుండా సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆ మేరకు ఈద్గా ప్రాంతమంతా చదును చేసే పనులు ఊపందుకున్నాయి. పండుగ రోజు సామూహికంగా ప్రార్ధ నలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీ మేరకు ఇటీవల అసెంబ్లీ వేదికగా శ్రీకాళహస్తిలోని ఈద్గాలు, దర్గాలు, షాదీఖానాలు, శ్మశా నాల దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఎమ్మెల్యే ఈదులగుంట ఈద్గా పరిశీలన సమయంలో అభివృద్ధికి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఈద్గా అభివృద్ధి పనులు ఊపందుకోవడంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిరుమలలో జెర్రిపోతు కలకలం



ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో 8అడుగుల జెర్రిపోతు హల్ చల్ చేసింది. అలిపిరి నడకమార్గంలో గాలిగోపురం వద్ద ఓ దుకాణంలో పాము నక్కింది. పామును చూసిన దుకాణదారులు, భక్తు లు పరుగు తీశారు. టీటీడీ ఉద్యోగి స్నేక్ క్యాచెర్ భాస్కర్ నాయుడుకు సమాచారం అందజేశారు. ఆయన పామును చాకచక్యంగా పట్టుకొని సమీప అడవుల్లో వదిలివేశారు.

జగన్‌తో సిరాజ్ భేటీ

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డిని తిరుపతి జిల్లా మాజీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ సిరాజ్ బాషా గురువారం తాడేపల్లిగూడెంలో కలిశారు. రంజాన్ పురస్కరించుకొని 26వన ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్ విందుపై వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఖాదర్ బాషాతో కలిసి సమాలోచించారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం



ప్రజాశక్తి - క్యాంపస్ : భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల 94వ వర్ధంతి సభ ఎస్వీయులోని ఎస్వి ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో పిడిఎస్ఓ సంఘ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ షహీద్ భగత్సింగ్ అతి చిన్నవయస్సులోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ప్రపంచంలోని సామ్రాజ్యవాదం సమూలంగా అంతం కావాలని, భారతదేశానికి సంపూర్ణ స్వరాజ్యం కావాలని పోరాడాడన్నారు. నేడు మన పాలకులు విద్యా, వైద్యం మొదలుకొని అన్ని ప్రభుత్వ రంగాలను, సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్నారన్నారు. విద్యా సంస్కరణల పేరుతో, నూతన విద్యా విధానాల పేరుతో విద్యా రంగంలోకి ప్రైవేటీకరణను ప్రవేశపెట్టారనీ, జాతీయ విద్యా విధానం – 2020 పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యారంగంపై సాగిస్తున్న దాడి పేద, మధ్యతరగతి విద్యార్థుల్ని డ్రాపౌట్లుగా మిగల్చడానికి మాత్రమే తోడ్పడుతుందనీ ఆరోపించారు. ఎస్వియూ అధ్యాపకులు డాక్టర్ డి.గోవిందు మాట్లాడుతూ అయోధ్య రామ మందిరం వివాదం, ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ చట్టాలు తీసుకువస్తూ పాలకులు పెంచి పోషిస్తున్న మత దురహంకార ప్రవాహంలో నేటి యువత కొట్టుకుపోతోందన్నారు. హిందువుల ఓటు బ్యాంకు కోసం మతపరమైన అంశాలను పాలకుల ఉద్దేశ్యపూర్వకంగా లేవనెత్తుతున్నారని, సోషల్ మీడియా మాధ్యమాలను మత విద్వేష ప్రచారానికి వేదికగా వాడుతున్నారనీ, గో రక్షణ పేరుతో దళితులపై, ముస్లింలపై అమానుషంగా దాడులకు సైతం పాల్పడుతున్నారన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న రచయితలు, ప్రజాతంత్ర వాదులు, సామాజిక కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని, తిరుపతి బుక్ ఫెయిర్లో బుక్ హౌస్ మీద దాడి చేశారని, హైదరాబాద్ బుక్ ఫెయిర్లో కూడా ఇలాంటి దాడే జరిగిందని,ఈ విధంగా మతం పేరుతోనో, దేవుడు పేరుతోనో దాడులు, మత విద్వేషాలకు పాల్పడటం వంటి చర్యలు, ఘటనలు కో కొల్లలుగా ఉన్నాయన్నారు. " ఏ జాతి వారైనా, ఏ కులం వారైనా, ఏ జాతీయతకి చెందిన వారైనా, ఏ దేశం వారైనా ప్రపంచంలోని పేద ప్రజల హక్కులన్నీ ఒక్కటే. మతం, రంగు, కులం, జాతీయత, దేశం అనే తేడాలను చెరిపెయ్యాలి. ఈ మార్పు యువతలో వస్తే ఈ దేశ భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుంది" అన్న భగత్సింగ్ స్ఫూర్తిని విద్యార్థులు, యువకులు అందిపుచ్చుకోవాలని, ఆ స్ఫూర్తితో మతోన్మాదాన్ని పెంచిపోషిస్తున్న పాలకుల విధానాలకు, సామ్రాజ్యావాద దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ భాస్కర్, కార్యదర్శి ఆర్. ఆశ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్యకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని ప్రతి రైతు పీఎం కిసాన్ లబ్ధిదారులుగా కొనసాగాలంటే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను జారీ చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. గురువారం కంచన పుత్తూరు, కుంభాకం, నెలవాయి, కాటూరు కనమనంబేడు, పెద్దపాలేడు, గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రిజిస్ట్రేషన్పై ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ ఓలు భాస్కర్, జగదీష్, బాలమురళీకృష్ణ, ఏఈఓ రేవతి, వీఎఎ లావణ్య, భరత్ కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్



ప్రజాశక్తి -కోట : మండలంలోని విద్యుత్ వినియోగ దారులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే ప్రధాన లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్ పర్సన్ రిటైర్డ్ జడ్జ్ వి.శ్రీనివాస్ ఆంజనేయ మూర్తిఅన్నారు. గురువారం కోట మండలం, చెందోడు విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయంలో విద్యుత్ సమస్యలపై స్థానిక విద్యుత్ శాఖ గూడూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వి.నరేందర్ రెడ్డి, ఏడిఈ చిన్నయ్యల ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యులు కే.రామ్మోహన్ రావు, సాంకేతిక సభ్యులు అంజనీ కుమార్ ,స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, ఏపీఎస్పి డీసీఎల్ గూడూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేంద్ర రెడ్డి, విద్యానగర్ సబ్ డివిజనల్ ఏడిఈ చిన్నయ్య, కోట, వాకాడు, చిట్టమూరు చెందోడు ఏఈలు శశికళ, తేజ, విజయలక్ష్మి, పోల య్య, చెందేడు సబ్ స్టేషన్ లైన్మెన్ శేషు, విద్యుత్ కార్యాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : కొర్లగుంట సెక్షన్ పరిధిలో గల 33/11 కె.వి మారుతి నగర్ ఫీడర్లో విద్యుత్ లైన్లలో కండక్టర్ మరమ్మత్తులు కారణంగా నేడు ఉదయం 09 నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపి.ఎస్పి.డి.సీయాల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈ.ఈ విన్నకోటిచంద్ర శేఖర్ రావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- ఏర్పేడు: ఏర్పేడు మండలం, పోతుమానుగుంట, పోతుమానుగుంట ఎస్టి కాలనీ లోనీ పేద విద్యార్థులకు యువతేజం ట్రస్ట్ వారిచే పౌష్టికాహారం కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ ప్రజాప్రతి ట్రస్ట్ కోఆర్డినేటర్, శ్రీ లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు శైలజ, పద్మజ, యువతేజం ట్రస్ట్ అధ్యక్షులు సంపత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జోగేంద్ర, సోషల్ మీడియా ఇంచార్జ్ మహేష్ కృష్ణలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దని వన్ టౌన్ సీఐ గోపి హెచ్చరించారు. గురువారం ఆయన తన సిబ్బందితో కలసి వైష్ణవ కోనేరు పరిసరాలను పరిశీలించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమన్నారు. ముఖ్యంగా పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో భక్తుల మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

న్యాయ విద్యార్థులు సమాజ సంక్షేమానికి కృషి చేయాలి



ప్రజాశక్తి - క్యాంపస్ :న్యాయ విద్యార్థులు సమాజ సంక్షేమానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పిలుపునిచ్చారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఐదు సంవత్సరాల న్యాయ విభాగంలో నూతన విద్యార్థులకు పరిచయ కార్యక్రమం గురువారం ఎస్వియూ సేనెట్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, దినకర్, అధ్యాపకులు అంజన్ సింగ్, నిర్మల, భవ్య, శ్రీలక్ష్మి , అమరేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుబంధ కళాశాలల్లో వీసీ ఆకస్మిక తనిఖీ



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కేకేసి విద్యా సంస్థ కళాశాలను వర్సిటీ ఉప కులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ విద్యా సంస్థ పరిధిలో ఎంబీఏ, లా, బిఈడి కళాశాలలో ఎస్వియు యూనివర్సిటీకి అనుబంధంగా నిర్వహిస్తున్నారు. అదే సమయంలో హెూమియోపతి, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలలను కూడా అదే సముదాయంలో నిర్వహించడం తనిఖీలలో వెలుగు చూసింది. బిఈడి, ఎంబిఎ కళాశాలకు ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు ఎవరు లేకపోవడం, బీఈడీ కళాశాల నందు నర్సింగ్ కళాశాలను నిర్వహించడం తనిఖీలలో బయటపడింది. దీనిపై ఉపకులపతి స్పందిస్తూ కోర్సులనూ ఎందుకు రద్దు చేయకూడదో తాకీదులు ఇవ్వాలని క్రింది అధికారులను ఆదేశించారు.

ఫరీద్కు పవార్ అభినందన



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గ వైసీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడుగా నియమితులైన పఠాన్ ఫరీద్ ఖాన్ను గురువారం పివిఆర్ సంస్థల అధినేత జనార్ధన రావు జె.పవార్ అభినందించారు. ఆయన్ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మైనార్టీల అభివృద్ధికి కృషి చేయాలని, వారి జీవన విధానంలో మార్పులు తేవడానికి పనిచేయాలని పవర్ సూచించారు.

బసవరాజు భాస్కర రాజు సంస్మరణ సభ



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎంపీపీ ఎలుమలై

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన బసవ భాస్కర రాజు చిరస్మరణీయుడని, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం పుత్తూరు విశ్రాంత భవనంలో బసవరాజు భాస్కర రాజు సంస్మరణ దినోత్సవం సభను గుణశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో భాస్కర రాజు కుటుంబ సభ్యులు, ఉపఖజనాధికారి సెల్వ రాజ్, సిబ్బంది, డాక్టరు రవి రాజు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కిరణ్, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర భాద్యులు జయరాం నాయుడు, కృపావరమ్మ, జిల్లా బాధ్యులు శంకర్, సిద్దయ్య, రవిశంకర్, మండల బాధ్యులు కుప్పయ్య, రామలింగం, చంద్రశేఖర వర్మ, అరుణాచలం, బాలసుబ్రమణ్యం, లోకేశ్వరి, రామ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డేగా రవి రాఘవేంద్ర జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యునైటెడ్ ఫోరం అధ్యక్షులు డేగ రవి రాఘవేంద్ర పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు వేగూరు విజయ్ కుమార్, పెంచలయ్య, సాంబమ్మ, నాసిన భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్కౌట్స్ అండ్ గైడ్స్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో గురువారం ఉదయం ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన స్కౌట్ అండ్ గ్రౌండ్ గైడ్స్ యూనిట్స్ ఏర్పాటు చేయడం జరిగినదని ప్రధానోపాధ్యాయులు కే.రమణయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించడం కోసం ప్రతి పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నరు. వీటి నిర్వహణకు 50వేల రూపాయలను కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ విజయ్ కుమార్, గైడ్ కెప్టెన్ కే.జయశ్రీ, ఉపాధ్యాయులు కిషోర్ కుమార్, సురేష్ బాబు, జహంగీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

ప్రజాశక్తి -కోట : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ సక్రమంగా ఉండాలని కోట ఎంఈఓ ధారా మస్తానయ్య తెలిపారు. గురువారం కోట మండలంలోని గూలి పంచాయతీ పరిధిలో ఉన్న చంద్రశేఖరపురంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను ఆయన పరిశీలించారు.

దశలవారీగా హామీల అమలు : అన్నా అనిత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలల కాలం మాత్రమే గడిచిందని, ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేయడానికి ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేస్తూ సీఎం చంద్రబాబు ముందుకెళుతున్నారని నగరపాలక సంస్థ కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి స్పష్టం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఉచిత బస్సు హామీకై తిరుపతిలో చేసిన నిరసన వారి ఉనికిని కాపాడుకోవడానికి అని స్పష్టమవుతుందన్నారు. ఎంతో అనుభవం కలిగిన నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ సంక్షేమాన్ని అందించడానికి దశలవారీగా నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు.